## క్లుప్తంగా

### కులగణన సర్వేను పూర్తి చేయండి



సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న కులగణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. బుధవారం పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. వలంటీర్లు పూర్తి చేసిన సర్వేను తనిఖీ చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### పిల్లలకు అక్షరాభ్యాసం



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ

కల్లూరు: మండలంలోని అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు శ్రీనివాసులు, వనజ కుమారి అర్బన్ పరిధిలోని ఎంపీపీఎస్ చింతలమునినగర్, అంగన్‌వాడీ కేంద్రం, ఎన్‌టీఆర్ నగర్, ఎంపీపీఎస్ సుందరయ్య నగర్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓలు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో వార్షిక తనిఖీలో భాగంగా రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

### గాయపడిన వ్యక్తి మృతి



దేవరాజు మృతదేహం

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన పోతురాజు దేవరాజు(44) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. లొద్దిపల్లె గ్రామానికి చెందిన పోతురాజు కర్రెన్న కొడుకు పి. దేవరాజు మంగళవారం సాయంత్రం కర్నూలు నుంచి లొద్దిపల్లె రహదారిలో ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అదే గ్రామానికి చెందిన రమేష్ కుమారుడు బైక్‌పై నన్నూరు వైపు వేగంగా నడుపుతూ దేవరాజు బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దేవరాజును కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కర్రెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

### పుల్వామా అమర సైనికులకు నివాళి



ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: పుల్వామా దాడిలో అమరులైన సైనికుల చిత్రపటాలకు బుధవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దివ్య, అధికారులు నివాళులర్పించారు. రెండు నిమిషాల మౌనం పాటించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. 2019 ఫిబ్రవరి 14న భారత సైనికుల వాహనాలపై ఉగ్రవాదులు కారుతో ఆత్మాహుతి దాడి చేయడంతో 40 మంది అమరులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మంజుల, సూపరింటెండెంట్ క్రిష్ణారెడ్డి, ఎంఈఓ శరభయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కల్లూరు: కల్లూరు ఎస్టేట్‌లోని శ్రీగోడల వీర హనుమంత రాయుడు దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ పూజారి నరసింహయ్య, చక్రవర్తుల బృందం స్వామివారికి పంచామృతాభిషేకం, నవగ్ర మాతృక, వాస్తు ఆరాధన, విశేష రుద్రయాగం, మహాపూర్ణాహుతి, హారతి తదితర పూజలు చేశారు. భజనలు, కోలాటాలు, బండలాగుడు పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు బైరెడ్డి శబరి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కాటసానికి దామోదర ఆయిల్ అధినేత మహేశ్వర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

# అతివకు ఆర్థిక భరోసా

- మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం
- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నాల్గో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ
- గడివేముల మండలంలో 597 గ్రూపులకు రూ.2.12 కోట్లు మంజూరు



గడివేములలో పొదుపు మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: మహిళా సాధికారతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం గడివేముల పొదుపు కార్యాలయం ఆవరణలో నాల్గో విడత ఆసరా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాలకు రూ.25 వేల కోట్ల రుణాలను మాఫీ చేసి నాలుగు విడతల్లో అందించారని తెలిపారు. ఇచ్చిన మాటను నిలుపుకున్న వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఇళ్లపట్టాలు, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికలకు ముందు పొదుపు రుణాలను మాఫీ చేస్తానని చెప్పి ఆధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఆ తర్వాత మోసం చేశారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని చెప్పారు. నాడు–నేడు పనులతో పాఠశాలలను కార్పొరేట్ బడులకు దీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో పాటు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసినట్లు చెప్పారు.

#### చంద్రబాబు పాలనంతా కరువుమయం

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం రాష్ట్రం కరువుతో అల్లాడిందని పేర్కొన్నారు. ఆయన హయాంలో కరువు మండలాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. జగన్ ఆధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో పంటలు బాగా పండాయని తెలిపారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎందేన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని 597 గ్రూపులకు చెందిన 7,164 మంది మహిళలకు రూ.2.12 కోట్ల మెగా చెక్కును అందించారు. వారితో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

#### జిల్లాలో రూ.544 కోట్ల ఆసరా నిధులు మంజూరు

నంద్యాల జిల్లాలో పొదుపు మహిళలకు నాలుగు విడల్లో రూ.544 కోట్లు మాఫీ జరిగినట్లు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనేక మంది మహిళలు తమ సొంత గ్రామంలోనే జీవనోపాధి పెందుతున్నారని చెప్పారు. ఫలితంగా వారి కుటుంబం ఆర్థికంగా ముందుకు సాగుతోందన్నారు. త్వరలోనే వైఎస్సార్ చేయూత కింద జిల్లాలోని లబ్ధిదారులకు రూ.650 కోట్లు వేయడం జరుగుతుందని తెలిపారు.

#### ఎస్సీ, ఎస్టీలకు అండగా సీఎం జగన్

రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడి అన్నారు. మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామానికి చెందిన 35 మంది ఎస్సీలకు జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకం కింద మంజూరైన పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. రూ.లక్షలోపు లబ్ధిదారులు తీసుకున్న మొత్తం రూ.9 కోట్ల రుణాన్ని ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేసి ఆ పొలాలపై సంపూర్ణ హక్కులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, ఐక్యసంఘం అధ్యక్షురాలు బిడుదూరు అనురాధ, తహసీల్దార్ గురునాథం, ఎంపీడీఓ శివరామిరెడ్డి, ఏపీఎం హజరత్, ఎంపీటీసీ సభ్యులు మహేశ్వర్‌రెడ్డి, తలారి మద్దమ్మ, బొల్లవరం సర్పంచ్ అంజనమ్మ, ఉప సర్పంచ్ శివానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, రఘుమాధవరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ,అనిల్‌కుమార్‌రెడ్డి, మేఘనాథరెడ్డి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

#### ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు



కరిమద్దెలలో సచివాలయాన్ని ప్రారంభిస్తూ..

గడివేముల: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గడివేమల మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభించారు. పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న కాలంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకన్న, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### ఆదర్శ గ్రామంగా కొండజూటూరును తీర్చిదిద్దాం



రైతు భరోసా కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: నియోజకవర్గంలో ''కొండజూటూరు''ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దామని, ఏళ్ల నాటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండజూటూరు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. నాలుగేళ్లలో కోట్ల రూపాయల మేరా అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రధాన రస్తా నుంచి పాఠశాల వరకు రూ. 20 లక్షల ఎంపీ నిధులతో సీసీరోడ్లు వేసినట్లు చెప్పారు. అలాగే డీఎంఎఫ్ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్లు, పాఠశాల నుంచి కాలనీ వరకు రూ.5 లక్షలతో మరో సీసీరోడ్డు వేసినట్లు చెప్పారు. అలాగే జేజేఎం కింద రూ. 35 లక్షలతో 9వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి ప్రజలకు సురక్షిత మంచినీరు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే నూతన ఆర్‌బీకే నిర్మించి అందుబాటులోకి తెచ్చామన్నారు. కొండజుటూరు–పొలూరు గ్రామాల మధ్య రూ. 1.60 కోట్లతో బీటీ రోడ్డు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెట్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, కర్నూల్ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు తప్పనిసరి

- డీఐఓ ప్రవీణ్‌కుమార్



శిశువుకు టీకా వేస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ప్రవీణ్‌కుమార్

ఓర్వకల్లు: గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ) ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఓర్వకల్లు మండలం నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులు, పిల్లలకు వేసిన టీకాల వివరాలను ఎప్పటికప్పుడు ఎంసీపీ కార్డులో నమోదు చేయాలన్నారు. ఆర్‌సీహెచ్, యూవిన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. తద్వార పిల్లలను వ్యాధుల భారి నుంచి కాపాడోకవచ్చని తెలిపారు. అలాగే 12 వారాల్లోపు గర్భిణులను నమోదు చేసుకుని సమయానుసారంగా ఆరోగ్య సేవలను అందించాలని సూచించారు. కాన్పుకు వెళ్లాల్సిన ఆస్పత్రిని ముందుగానే గుర్తించి వివరాలను ఏఎన్‌ఎం యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మాతాశిశుసంరక్షణ సేవలను వారికి వివరించారు. గర్భిణులు ప్రధానంగా ఐరన్ ఎక్కువగా ఉన్న నువ్వులు, బెల్లం, రెడ్ కిడ్నీ బీన్స్, పచ్చని ఆకుకూరలు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రతి గర్భిణికి అందజేయాలన్నారు. గర్భస్థ సమయంలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించి, బరువును చూసుకోవాలన్నారు. ముఖ్యంగా రక్తస్రావం, అధిక రక్తహీనత, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ప్రసవం తర్వాత నెల రోజుల వరకు తీవ్రమైన జ్వరం వస్తే సంబంధిత ఆశా, ఏఎన్‌ఎంలకు తెలియజేయాలన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి ఐఎఫ్‌ఏ, విటమిన్–ఏ సిరప్‌ను పంపిణీ చేయాలని ఆదేశించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం నన్నూరు పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట వైద్యాధికారి నాగరాజు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం

- చురుగ్గా గృహ నిర్మాణాలు



కె.నాగులాపురంలోని జగనన్న లేఔట్‌లో నిర్మించుకున్న ఇళ్లు

గూడూరు: పేదల సొంతింటి కల నెరవేరింది. జగనన్న గృహ నిర్మాణ పథకంలో అనేక మంది గృహాలు నిర్మించుకుని తమ సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. మండలంలోని గూడూరు, గుడిపాడు, మునుగాల, చనుగొండ్ల, పెంచికలపాడు, కే.నాగులాపురంలో ఇప్పటికే చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా మరికొన్ని తుది దశకు చేరుకున్నాయి.

#### జగనన్న లే ఔట్‌లో మౌలిక వసతులు

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో యూనిట్ విలువ రూ. 1.80 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇసుక, సిమెంట్, స్టీల్‌ను ప్రభుత్వమే అందించింది. జగనన్న లేఔట్‌లో హౌసింగ్ అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. కాలనీల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే సీసీరోడ్లు, మురుగుకాలువలను నిర్మించారు. సొంతింటి కల సాకారం కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మండలంలో పూర్తయిన ఇళ్ల వివరాలు**

| | | |
|---|---|---|
| గూడూరు | - | 100 |
| గుడిపాడు | - | 50 |
| మునుగాల | - | 90 |
| చనుగొండ్ల | - | 70 |
| పెంచికలపాడు | - | 60 |
| కే.నాగులాపురం | - | 200 |
| వివిధ దశల్లో ఉన్న ఇళ్లు | - | 500 |

### రోడ్డు భద్రతపై అవగాహన

కర్నూలు కల్చరల్: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కర్నూలు–2 డిపో గ్యారేజ్‌లో రోడ్డు భద్రతపై డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్నూలు ఆర్‌టీఓ ఎస్.రమేష్ హాజరై మాట్లాడారు. అనతంరం 18 మంది ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు.

# కూలీలందరికీ ఉపాధి పనులు

- ఏపీడీ పక్కీరప్ప



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీడీ పక్కీరప్ప



ప్యాలకుర్తిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: కూలీలందరికీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఉపాధి ఏపీడీ పక్కీరప్ప అన్నారు. బుధవారం కోడుమూరులోని ఉపాధి కార్యాలయంలో ఏపీఓ మోదీన్‌బాషాతో కలిసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి పని కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం 1,400 మంది కూలీలు మాత్రమే పనులకు వస్తున్నారని, వారం చివరిలోగా 2,400కు పెంచాలని ఆదేశించారు. కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో కొత్త పనులు గుర్తించాలని, రైతుల పొలాల్లో ఇంకుడు గుంతలు తవ్వేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మండలానికి పశువులు, గొర్రెల షెడ్లు 60 యూనిట్లు మంజూరయ్యాయని, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని ఏపీడీ సూచించారు. అలాగే ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులకు ఉపాధి హామీ పథకం కింద అన్ని రకాల పండ్ల తోటలు, మల్లె, గులాబి వంటి పూల తోటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని తెలిపారు. ఆసక్తి గల రైతులను గుర్తించాలని చెప్పారు.

### నేడు పీఆర్‌అండ్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు రాక

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం, కర్నూలు రూరల్ మండలంలోని సచివాలయాలను తనిఖీ చేయనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు వైఎస్సార్ జగనన్న కాలనీలు, పీఆర్ రోడ్లు, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్‌లపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. అనంతరం 3 నుంచి 4 గంటల వరకు సెర్ప్ సమావేశం, 4 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక ఎమ్మెల్యే, గ్రామ సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సర్పంచు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, మార్కెట్‌యార్డు చైర్మన్‌లతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు.

### దోమల నివారణకు చర్యలు

కర్నూలు (టౌన్) : నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం నగరంలో పెద్ద ఎత్తున ఫాగింగ్, మురుగు కాల్వల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. నగరంలో నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తి అధికమైందన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు ముమ్మరం చేశామన్నారు. కొత్తగా రూ.5 లక్షలు వెచ్చించి ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశామన్నారు. హంద్రీ, తుంగభద్ర నదుల్లో పెరిగిన గుర్రప్పు డెక్కతో దోమలు వ్యాప్తి జరుగుతున్నట్లు గుర్తించి వాటిని తొలగించే పనులు ముమ్మరం చేశామన్నారు.

### 'సిద్ధం' సభను జయప్రదం చేయండి



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న కాటసాని

పాణ్యం: అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18వ తేదీ నిర్వహించనున్న 'సిద్ధం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కొండజుటూరు గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలన్నారు.

### కనుల పండువగా పెద్దమ్మ దేవర

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో పెద్దమ్మ దేవర బుధవారం కనుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించారు. దేవర సందర్భంగా ఊరంతా బంధుమిత్రు పరివారంతో కళకళలాడింది.



మస్తానయ్యకు పూజలు చేస్తున్న భక్తులు

# కృష్ణాపురంలో ఘనంగా కిస్తీ ఉత్సవాలు



ఫలహారం బండ్ల ఊరేగింపులో గ్రామస్తులు

కోడుమూరు రూరల్: కృష్ణాపురం గ్రామంలోని శ్రీహజరత్ మస్తానయ్య స్వామి ఉరుసులో భాగంగా బుధవారం సాయంత్రం కిస్తీ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున ఫలహారం బండ్లను కట్టుకొని దర్గా వద్దకు చేరుకుని మస్తానయ్య స్వామికి ప్రత్యేక చదివింపులు చదివించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్వామి వారికి జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, గ్రామపెద్దలు శంకర్‌రెడ్డి, శ్రీరాములు, గిడ్డయ్య, రవి, ఆదోని శ్రీరాముడు, దస్తగిరి చదివింపులు చదివించారు.

# అభయాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ విజయమనోహరి

కల్లూరు: స్థానిక లక్ష్మీపురంలోని జగన్నాథగట్టు మార్గంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో జీర్ణోద్ధరణ పనులు చేశారు. బుధవారం రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట, కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. కర్నూలు కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ విజయ మనోహరి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ.. భక్తులు, ప్రజల సౌకర్యార్థం ఆలయ పునర్నిర్మాణం చేయడం భగవంతుడు తమకు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధినేత కేవీ సుబ్బారెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భగీరథ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

కర్నూలు(సెంట్రల్): జీఓ నంబర్ 535లోని నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. బుధవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటిస్థలం ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ అక్కడికే సమాచార శాఖ డీడీ జయమ్మను పంపి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆమెతో చెప్పించారు. అనంతరం ఆ అసోసియేషన్ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వగా 535 జీఓ ప్రకారం అర్హులకు న్యాయం చేస్తామని, జాబితాను మరోసారి పరిశీలించాలని తహసీల్దార్లను ఆదేశించినట్లు చెప్పారు. ఐదేళ్ల అనుభవం కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలం కేటాయించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర కోరారు.